

# స్ప్లిట్ సెకండ్

"అమ్మా, అన్నయొచ్చాడు. కాఫీ పట్రా" అప్పుడే గుమ్మంలో అడుగుపెడుతున్న శివరావునిచూసివంటింట్లోని తల్లికి వినపడేలా అరిచింది ఎనిమిదేళ్ళ చెల్లెలు.

"ఇష్. మీ వదినని తీసుకురమ్మను అమ్మదేనికీః" అన్నాడు శివరావు.

కుర్చీలో కూర్చుని కుడికాలి బూట్ లేసు విప్పుకుంటున్న శివరావుని చూసి చిన్నగా నిట్టూర్చింది అప్పుడే కాఫీ గ్లాసుతో అడుగుపెట్టింది మైథీలి.

కాఫీగ్లాస్ ప్రక్కనపెట్టి తను విప్పాలనుకుంది ఆ బూట్లలేసులని. అలసిపోయిన భర్తని చిరునవ్వుతో, చిరుహస్తాలతో సేదతీర్చాలనుకుంది స్వయంగా కాఫీ తాగించాలనుకుంది.

కాని కుదరదు, ఆ చిన్నయింట్లో ఎవరికంటా పడకుండా ఏ పనీ చెయ్యటం కష్టం. సిగ్గు తనకి. అందుకే బలవంతంగా తన కోర్కెలన్నింటినీ అణచుకుంటుంది మైథిలి నిట్టూర్పులతో.

తల ఎత్తి మైథిలి వంకచూసి అన్నాడు శివరావు, రెండోముడి విప్పుతూ.

"హలో డార్లింగ్, వచ్చేసా!"

చిన్నగా నివ్వింది మైథీలి.

"కాఫీనా? థాంక్యూ"

కాఫీ గ్లాసుతోపాటు చెయ్యికూడా అందుకున్నాడు. మృదువుగా చెయ్యి విడిపించుకుంది మైథిలి.

"త్రాగించు"

"ఆ లోచిస్తే అలాగే చేస్తాను. ఇక్కడ కాదు, ఇప్పుడు కాదు"

"ఓహో! అదా అలక చిలకమ్మగారికి, అయితే ఓ శుభవార్త"

"ఏమిటి?"

"ఈ చిలుకా గోరింకలకో చక్కటి చిన్న గూడు వెదికిపెట్టాను" అన్నాడు గొంతు తగ్గించి.

"నిజంగానా?"

మైథిలి కళ్ళలో సంతోషం ఆత్రం కనిపించాయి.

"చాలా దూరంలో. ఇక్కడ నుంచి దాదాపు పదిమైళ్ళు"

"థాంక్యూ! థ్యాంక్యూ సోమచ్"

"మరిప్పుడు తాగించు అమృతాన్ని నీ చేతులతో" ముందుకు వంగాడు శివరావు కొంటెగా.

"వదినా! నువు తెచ్చావా కాఫీ? నేనుకూడా తెచ్చాను" శివరావు ఏనిమిదేళ్ళ చెల్లెలు కాఫీ గ్లాసుతో వచ్చి అన్నది.

"అయితే నువ్వే తాగమ్మా దాన్ని"

చిరాకుగా అని గటగటా తాగేసాడు మైథిలి తెచ్చిన గ్లాస్‌లోని కాఫీని శివరావు.

"అమ్మని అడిగి తాగుతాను. తమ్ముడికికూడా ఇవ్వమంటుందేమో కనుక్కుంటాను"

శివరావు చెల్లెలు వంటగదిలోకి వెళ్ళిపోయింది మళ్ళీ.

"ఎప్పుడు అక్కడకు మారేది?" ఆత్రంగా అడిగింది మైథిలి భర్తని.

"మరో పదిరోజుల తర్వాత"

"పదిరోజులా ఇంకా? ఇంకా ఖాళీ అవకుండానే అడ్వాన్స్ ఇచ్చేసారా?"

"ఈ సంతోషవార్తతోపాటు ఓ చిన్న విచారకరమైనవార్త. ఇవాళ రాత్రే నేను వూరు వెళతున్నా.

గుండెల మీద అప్రయత్నంగా చెయ్యివేసుకుని అన్నది మైథిలి.

"ఏ వూరు? ఎప్పుడు తిరిగి వచ్చేది?"

"మద్రాస్. పదిరోజుల తర్వాత."

"దేనికి?"

"ఆఫీస్‌వాళ్ళు ట్రెయినింగ్‌కి పంపిస్తున్నారు.

"వద్దని చెప్పలేక పోయారా?"

"చెప్పాను. పెళ్ళయి నెలయినా కాని భార్యాభర్తలనిద్దరినీ ఇలా విడదీయటం మీకు న్యాయం కాదని చెప్పాను. అయినా ఈ ట్రెయినింగ్ పూర్తి చేసుకుంటేగాని పైకి వెళ్ళేందుకు ఆస్కారం వుండదు ఈ వుద్యోగంలో. ఎప్పుడో కాని రాదు ఈ అవకాశం"

"మీ ఇష్టం"

"కాదు. చిలకమ్మ ఇష్టమే. వద్దంటే మానేస్తాను. అయినా పది రోజులేగా"

"అబ్బాయ్. ఓసారి ఇలా వస్తావా?"

బయట నుంచి లోపలికి వెళుతూ శివరావు తండ్రి అన్నాడు శివరావుతో, వాళ్ళిద్దరివంకా చూసి. భృకుటి ముడివేసి కొద్దిగా కోపంగా.

"పిలుస్తున్నారు" అన్నది మైథిలి నీరసనగా.

"ఇప్పుడే వస్తాను. ఈ వుత్తరం చదివి, అందులో అండర్‌లైన్ చేసిన వాక్యాలు మర్చిపోకు"

జేబులోంచి ఓ కాగితం తీసి అందించాడు రహస్యంగా.

"నేనుకూడా రాసాను నిన్నటి దానికి సమాధానం. నేను అండర్ లైన్ చేసిన వాక్యాలు కూడా మర్చిపోకండి.

జాకెట్‌లోంచి కొద్దిగ తడిసిన కాగితం తీసి అందించింది మైథిలి భర్తకి.

"ఈయనెప్పుడూ అడ్డం వస్తారు. మనం మాట్లాడుకుంటూంటేనే పిలుస్తారు మిమ్మల్ని. ఈ ఇంట్లో ఎవరూ మనం సుఖంగా వుంటే చూడ లేరు." అన్నది మైథిలి ఈసడింపుగా భర్తకిమాత్రం వినబడేట్లుగా.

"ఇంకెన్ని రోజులు డార్లింగ్. పదిరోజులు ఓపికపట్టు పదకొండో రోజు వదిలేస్తే అవ్వాల్టినుంచి చచ్చేదాకా నాకు నువ్వు, నీకు నేను. మన మధ్య ఎవరూ అడ్డంరారు."

"అబ్బాయ్, నిన్ను పిల్చాను ఇందాక"

లోపలనుంచి తండ్రి కంఠం వినబడింది మళ్ళీ. మైథిలి బుగ్గమీద చిటికవేసి తండ్రి కూర్చున్న గదిలోకి వెళ్ళాడు శివరావు.

"రేడియో లైసెన్స్ సంగతి ఏంచేశావ్?" అడిగాడు కొడుకుని.

"మర్చిపోయాను రేపుకడతాను"

"ఇంత మతిమరుపవుతే ఎలారా ఈ వయసులోనే? ఇవాళే ఆఖరి రోజని చెప్పాగా ఆఫీస్‌కి వెలుతూంటే. దారిలోనే కదా పోస్టాఫీస్"

"ఇవాళ రాత్రి మద్రాస్ వెలుతున్నాను నాన్నా. పదిరోజులు ఆఫీస్ ట్రెయినింగ్‌కోసం వెలుతున్నాను. బట్టలు సర్దుకోవాలి. ఇంకా ముఖం కూడా కడుక్కోలేదు"

బాత్‌రూంలోకి వెళ్ళి వేసివున్న తలుపు ముందుఆగి, "లోపల ఎవరూ? త్వరగా రండి" అన్నాడు.

తలుపు తెరచుకుని బయటకి వచ్చింది మైథిలి.

"హలో డార్లింగ్ నువ్వా" అన్నాడు శివరావు ఆనందంగా.

"వుత్తరం చదివాను. ఇక్కడకంటే ఉత్తరాలు చదివేందుకు వేరే చోటులేదు ఈ పాడుకొంపలో. వీటిని దాచుకుని అప్పుడప్పుడూ మళ్ళీ చదివి ఆనందించే యోగ్యత కూడా లేదీ కొంపలో. నన్నుకూడా మీతో

మద్రాస్ తీసుకువెళ్ళండి. మీరు అండర్‌లైన్ చేసిన వాక్యాలకి అదే సమాధానం"

మైథిలి కళ్ళలో, మొహంలో బాధ, ఆవేదన గమనించి చకితు డయ్యాడు.

"నువ్వు చెప్పక మునుపే ప్రయత్నించాను దొరకలేదు టిక్కెట్స్. రిజర్వేషన్ లేకుండా థర్డ్‌క్లాస్‌లో వెలుతున్నాను నేను. నువ్వు నాలాగా ప్రయాణం చెయ్యలేవు అంతదూరం"

"ఎలాగైనా ఫర్వాలేదు. మీతో వుంటే. నన్నూ తీసుకువెళ్ళండి. పదిరోజులూ వీళ్ళతో వేగలేను.

"ఈ విషయంలో మాత్రం ఏం చెయ్యలేను సో సారీ డార్లింగ్.

"అమ్మాయ్ మైథిలీ కొద్దిగా కాకరకాయలు తరిగి పెడుదూ" అత్త గారు వాళ్ళిద్దరూ మాట్లాడుకోవటం గమనించి అంది మైథిలితో.

"కాకరకాయ వారు తినరత్తయ్యా, వంకాయ వేపుడు—"

"చెప్పినట్లు వినమ్మా"

కరకుగా అని లోపలకెళ్ళిపోయింది శివయ్య తల్లి. భర్త కళ్ళలోకి చూసి అన్నది.

"మీ ఉత్తరం ఇంద"

యాంత్రికంగా ఉత్తరం అందుకున్నాడు శివరావు. తలుపుమూసి లోపల గడియపెట్టి ఓసారి మైథిలి వ్రాసి ఇచ్చిన పుత్తరాన్ని విప్పాడు కాగితం మడతలు.

పెన్సిల్‌తో వ్రాయబడి వున్నాయి అక్షరాలు గజిబిజిగా, తొందరలో వ్రాసినట్లుగా.

నా ప్రాణానికి,

నిన్న మీరు వ్రాసిన ఉత్తరం చదివితే నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయంటే నమ్మరు మీరు. మీరు వెంటనే నాకు మాటఇచ్చినట్లుగా అయిదు

రోజుల్లో ఓ మంచి ఇల్లు చూడండి. ఓ గదయినా చాలు మనిద్దరికీ ఎక్కడైనా ఫర్వలేదు.

పెద్దవాళ్ళ కిష్టంలేకుండా ప్రేమించి, కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని, భార్యతో ఇంట్లో అందరిమధ్యా కాపురంచేస్తే ఎలా వుంటుందో పూర్తిగా అర్థమయింది. మనం కోరుకున్న సుఖం అందకుండా మనల్ని దూరంచేసి వీళ్ళు కక్ష సాధించుకుంటున్నారు. మనం సుఖపడితే వీళ్ళు చూడలేరు.

మూడు నిద్రల తర్వాత ఈ ఇంటికి వచ్చాక ఇప్పటిదాకా మనకి ఒక్క పావుగంటయినా స్వేచ్ఛ, ఒంటరితనం దొరకలేదు. కొత్తగా పెళ్ళయినవాళ్ళు మరొకళ్ళయితే ఈపాటికి ఎన్ని రాత్రుళ్ళు అన్యోన్యంగా గడిపేవాళ్ళో.

ఏది ఏమయినాసరే. ఇవాళ రాత్రిమాత్రం నేను మీ గదికివస్తాను. మీ చెల్లెల్ని, తమ్ముళ్ని వంటగదిలో పడుకోబెట్టండి. ఈ విషయంలో పూర్తిగా మరుగు కావాలి మనకి. ఎవరో చూస్తున్నారన్న భయంతో దగ్గరవలేము. అందుకే ఈ నెలరోజులూ పెళ్ళయిన బ్రహ్మచారులుగా వుండిపోయాం ఇకమాత్రం ఇలా గడపటానికి వీల్లేదు.

విత్ థవుజండ్స్ ఆఫ్ కిసెస్,

మీ చిలకమ్మ

చివరపేరాలో అండర్‌లైన్ చేసిన కొన్ని వాక్యాలని మళ్ళీ చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు శివరావు. ఉత్తరం చదివి జేబులో పెట్టుకుని, గబగబా ముఖం కడుక్కుని బయటపడ్డాడు.

మైథిలి ఇచ్చిన టవల్ అందుకునేలోపలే తల్లి శివరావుమీదకి విసిరేసి అన్నది గట్టిగా.

మొహం తుడుచుకునివెళ్ళి ఓ శేరు ఉప్పు తెచ్చిపెట్టరా త్వరగా రావాలి ఇక్కడున్నట్లుగా."

"రాత్రికి ఊరెళుతున్నానమ్మా. మళ్ళీ పదిరోజుల తర్వాతవస్తాను, చెప్పాడు శివరావు మొహం తుడుచుకుంటూ.

"కోడలిని తీసుకెళుతున్నావా కూడా?" అడిగింది శివరావు తల్లి.

"తీసుకెళ్ళనా?" ఎదురుప్రశ్న వేశాడు.

"తీసుకెళితే నా నలుగురు పిల్లలకీ ఆయనకి నాకూ చాకిరీ ఎవరు చేస్తార్రా? తీసుకువెళ్ళద్దు."

గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది మైథిలి. చిన్నగా నవ్వుకున్నాడు శివరావు ఇంకెన్ని రోజులు?

* * *

కిటికీలోంచి కదులుతున్న టెలిగ్రాఫ్ స్తంభాలవంక, కలుసుకుని విడిపోతున్న టెలిగ్రాఫ్ తీగలవంక, చెట్లవంక చూస్తున్నాడు మైథిలి గురించి, నెలక్రితం జరిగిన తమ ప్రేమ వివాహాన్ని గురించి ఇంటిలో తల్లిదండ్రుల ప్రవర్తన గురించి ఆలోచిస్తున్నాడు.

మైథిలి ఎంత అందమైందో, ఎంతహుషారైందో,తెలివైందోఅంత మంచిదికూడా. కాకపోతే నెలనుంచి తమకి కావాలనిఏడబాటుకలిగించేపెద్ద వాళ్ళ ప్రవర్తనని,వెట్టిచాకిరీని ఎలా మౌనంగా దెబ్బలాడకుండా భరించ గలదు?

తను వున్నప్పుడే అలావుంటే తను లేని ఈ పదిరోజులు ఎలా వుంటారో? నోరెత్తవద్దని చెప్పివచ్చాడు తను మైథిలికి. వాళ్ళేంచేసినా? మరో పదిరోజులు మాత్రమే. ఆ తర్వాత మంచితనంగాబయటికివెళ్ళచ్చు దెబ్బలాడుకుని బయటకు వెళ్ళేబదులు.

శివరావు జేబులోంచి చిన్న కాగితాల దొంతర తీశాడు. తను మైథిలికి, మైథిలి తనకు వ్రాసిన ఉత్తరాలు అవన్నీ. తాము చెప్పాలనుకున్నవి చెప్పే అవకాశంలేక ఇలా కాగితాలమీద ఒకరికొకరు వ్యక్తం చేసుకోవాల్సివచ్చింది.

"మైథిలి తను చదవగానే ఉత్తరాలన్నీ తిరిగి ఇచ్చేస్తుంది, తన

దగ్గరే వుంటే ఎవరి కంటయినా పడుతుందని. చింపేయకుండా జాగ్రత్త పెట్టాడు. శివరావు వాటిని ఆఫీసులో అప్పుడప్పుడు తీరిక చిక్కినప్పుడు చదువుకోవచ్చుని.

మైథిలి మొదలుపెట్టింది ఇలా ఉత్తరాలు వ్రాయడం. మైథిలే నేర్పింది ఉత్తరాలు పెళ్ళానికి ఎలా వ్రాయాలో మైదిలి ఉత్తరాలలో పెంకితనం, గడుసుతనం సున్నితమైన హాస్యంతోపాటు చక్కని చిక్కటి రొమాన్స్ కూడా తొంగిచూస్తుంది.

మైథిలి వ్రాసిన మొదటి ఉత్తరం విప్పి చదివాడు.

నా ప్రాణానికి,

రెండురోజులైంది మీ ఇంటికివచ్చి. మీ ఇంటిలో సంసారం బొత్తిగా జానెడుకూడా లేదనిపిస్తోంది సరిగ్గా కొలిస్తే. మరి మీకేలా అబ్బిందబ్బా?

మొగుడితో నాలుగు మాటలు చెప్పుకుందామని శ్రీమతి వ్రాయించు ఈ లేఖని సావధానంగా సొంతం చదివి తిరిగిలేఖ వ్రాయించమని విన్నపం.

సాయంత్రం సినిమాకి వెళదామా? ఎంచక్కా సినిమాలో, చీకట్లో, తెరమీద బూతుపాటల డ్యూయెట్ల మధ్య మనం....

"తీసుకెళ్ళరూ?

మీ చిలకమ్మగారు.

ఆ ఉత్తరంకి తను వ్రాసిన సమాధానం స్టేపిల్ చేయబడివుంది. ప్రశ్నాపత్రానికి ఆన్సర్ పేపర్‌లాగా తను వ్రాసిన సమాధానం చదివాడు శివరావు.

చిలకమ్మకి,

కోపం వచిందా? సారీ డార్లింగ్, సినిమాకనుకుని బయలుదేర

బోతుంటే అమ్మకి తలనొప్పి వచ్చింది. ఎంతగొడవ జరిగిందో నువ్వే చూశావుగా. రేపు తప్పకుండా వెళదాం. మరి నాకేమిస్తావు సినిమాలో?

శివరావు జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి ఓ ఫిల్టర్ కింగ్ వెలిగించి మళ్ళీ మరో ఉత్తరం తీశాడు. తను రాసింది అది.

చిలకమ్మ,

థాంక్యూ, థాంక్యూ, థాంక్యూ డార్లింగ్. నిన్నొకరోజూ సినిమాకి తీసుకెళతాను. ఏపిల్స్ మంచివి రెండు కొనిస్తానన్నావు సినిమాలో. అబ్బ అవి నిజంగా ఏపిల్సేనుమా. గోల్డెన్ ఏపిల్స్. నీకింత చిలిపితనం ఎలా వచ్చిందబ్బా! ఐ లవ్ యూ డార్లింగ్.

నీ సేవకుడు.

శివరావు కళ్ళల్లో కొత్తకాంతి, గుండెల్లో పరుగు ఏర్పడ్డాయి ఆ ఉత్తరం మొదలు పెట్టగానే మైథిలి వ్రాసిన ఉత్తరం అది. మైథిలివ్రాసిన ఉత్తరాలన్నిటిలో అది బాగా నచ్చింది శివరావుకు.

నా ప్రాణానికి,

తప్పు, అడక్కూడదు, అలా గోలచేస్తే అందరికి తెలిసిపోతుంది మీ కోడ్ భాష పొడుగానూ. నాకు సిగ్గెస్తుంది, ఓ చిన్న కథ చెప్పనా?

ఓ పెద్ద మైదానం మైదనం నిండా రెండడుగుల ఎత్తు లేతగడ్డి ఆకు పచ్చగా, సన్నటి చిరుజల్లు అర్ధరాత్రి పౌర్ణమికామోసు, పిండారబోసినట్లు వెన్నెల. ఆవాన తుంపరమీద వెన్నెలపడి తీగల్లా మెగుస్తున్నాయి. అకాశంనుంచి వేలాడుతున్నాయా అన్నట్లుగా.

అంతేకాదు. ఆపచ్చగడ్డి మధ్య పందడుగుల వ్యాసంలో సూది మొన దూరలేనంతగా ఎత్తుగా పడివున్నాయి ఎర్రగులాబీలు, తెల్లగులాబీలు అన్నీ కలిసి ఆ గులాబీలకు ఏమాత్రం ముళ్ళు లేవండోయ్ అన్నీ సువాసనవేసే అందమైన గులాబీలే. ముట్టుకుంటే కందిపోయేటట్లుగా ఉన్నాయి.

ఆ పందడుగుల వ్యాసంచుట్టూ నాలుగడుగుల ఎత్తువున్న దంతంతో చేసిన స్టాండ్సుమీద అగరవత్తులు వెలుగుతున్నాయి. ఆ అగరవత్తుల పొగ ఆ వ్యాసంచుట్టూనే తిరుగుతోంది గాలిలో తేలిపోకుండా.

ఆ గులాబీలమీద ఏమిటబ్బా అదీ? ఏదో పాన్పులాగా వుందే?

ఛ. పాన్పుకాదు. పొరపాటు. తూలికాతల్పం హంసతూలికాతల్పం. పాలరాతితో చేసిన హంస తూలికాతల్పం. ఆ వెన్నెలలో ధగధగ మెరుస్తోంది.

అరె! దానిమీద ఎవరో కదులుతున్నారే? ఎవరబ్బా- ఒకరుకాదు, ఇద్దరూ. వాళ్ళ ఒంటిమీద బట్టలు ...

దేవతా వస్త్రాలు ధరించినట్లున్నారు. దేవతావస్త్రాలలోని మహత్తు తెలుసా మీకు? మీ తెలుగు పిలక లెక్చరర్ ఎప్పుడూ చెప్పిన పాఠాన పోలేదా? వాడి పిలక తెగా, నేచెప్తా వినండి. మా తెలుగు పంతులమ్మ చెప్పింది. ఆమెకి పిలక లేదుకాని నశ్యం పీల్చేదంటారు)

దేవతా వస్త్రాలు వేసుకుంటే అసలు బట్టలు వేసుకున్నట్లే వుండదుట ఏమాత్రం. అనుమానం వస్తుందట వేసుకున్నారా లేదా అని.

మనిద్దరం చూద్దామా వాళ్ళేం చేస్తున్నారో? దగ్గరకి పోదాంరండి. అబ్బ, చెయ్యిపట్టుకుని లాగితేకాని రారేమిటండీ? మరీ అంత సిగ్గా?

అబ్బబ్బ— కళ్ళు తెరచి చూడండి సార్, మైగాడ్!

ఆ తల్పంమీద మనిద్దరిలా వున్నారే వాళ్ళు? అరే మనిద్దరమే. ఇప్పుడు నాకు మీరు కనబడుతున్నారు. నిజంగా మనమేనండీ. ఇది కల కాదుకదా? అవకుండావుంటే ఎంత బాగుండు.

హా తేరి. మీకు సరసంకూడా తెలుసే. మీ పిలక తెలుగుమాష్టారు కాని నేర్పలేదుకదా? కాకపోతే ఆ చిలిపిపనిచేసి ఏమీఎరగనట్లు సంస్కృత శ్లోకం చదువుతారే——

వచ్చేసారు. ఆ వైపునుంచి నా అత్త, ఈ వైపునుంచి మీ నాన్న

వచ్చేసారు. మనిద్దరినీ బరబరా చెరోచెక్క పట్టుకుని లాక్కుపోతున్నారు ఇంక ఆపేస్తా. అత్తయ్య పిలుస్తోంది. సూదిలో దారం గుచ్చివ్వమని.

మనకాప్రాప్తం వుండదు.

మీ చిలకాయ్.

శివరావు మరోసారి చదువుకున్నాడు ఆ ఉత్తరాన్ని తనివితీరా. మైథిలి మెత్తగా, చిక్కగా, చక్కగా వ్రాస్తుంది. కవిత్వం రాసేశక్తి వుంది.

మరో ఉత్తరం తీసి చదివాడు. తను వ్రాసింది.

నా ప్రాణానికి,

నీ కథ పోస్టు చేసాను. తప్పకుండా ప్రచురిస్తారు. నీలో మంచి రచనాశక్తి వుంది తెలుసా? కథలు వ్రాసే ఓ మిత్రుడు ఎంతో మెచ్చుకున్నాడు నీ కథ చదివి. ఇల్లుకోసం బాగా ప్రయత్నిస్తున్నాను.

నేను జీవితభీమా చేద్దామనుకుంటున్నాను పన్నెండు వేలకి. వచ్చే నెలలో గానీ, ఆపై నెలలోగాని, మద్రాస్ వెళ్ళిరావాల్సి వస్తుందిత్వరలో. ట్రెయినింగ్ వీలైనంత వరకూ రాకుండా ప్రయత్నం చేస్తాను. మద్రాస్ నుంచి తిరిగిరాగానే ఎల్. ఐ. సి పాలసీ తీసుకుంటాను. తిరిగిరాగానే మనిద్దరిపేరా జాయింట్ ఎకౌంట్ ఒకటి తెరుద్దాం. నీవు కోరిన మామిడి పిందెల నెక్లెస్‌కి ఆర్డరిచ్చాను, మద్రాస్‌నుంచి నీకేం తీసుకురావాలి?

నీ సేవకుడు

సిగరెట్ పూర్తిగా త్రాగి, సిగరెట్ పీక వేగంగా వెళుతున్న రైలు కిటికీలోంచి బయటికి విసిరి లేచాడు శివరావు.

ఒళ్ళు విరుచుకుని గుమ్మంవైపు కదిలాడు. బాత్‌రూంలోని చన్నీళ్ళతో మొహం కడుక్కుని, పాకెట్ కోంబ్‌తో జుట్టు దువ్వుకున్నాడు వెనక్కి.

మైథిలి మీసాలు పెంచమంది. ఈ పదిరోజులు మీసాలు గీసుకోకూడదు, గడ్డంతప్ప. పదిరోజులు పెంచితే ఓ రూపు వస్తుంది.

ఇన్‌షర్ట్ సర్దుకుని, బూట్‌లేసులు గట్టిగాలాగి బిగించుకుని బయ టికివచ్చాడు. తలుపు ప్రక్కన నిలబడి బయటికి చూస్తూండిపోయాడు మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌లోంచి. బాగా చీకటిగా వుంది బయట. కను పొడుచు కున్నా కానరాని చీకటి.

మరో సిగరెట్ వెలిగించి కొత్తఉత్తరం చదవడం ప్రారంభించాడు శివరావు.

నా ప్రాణానికి,

ఎప్పుడూ లేనిది డబ్బు లెక్కలగురించి వ్రాసారేమిటి? నేనడిగి నప్పుడు ఓ సినిమాకి తీసుకెళ్ళి, నెలకో చీరో, నగో కొనిపెడితే ఇంకేం కావాలి.

తెలుగు మరిచారా? లేక అచ్చు తప్పా?

చిలకకి బదులు పిలకా అని వ్రాస్తారా? అయ్? ఎంతధైర్యం? మీ తెలుగు లెక్చరర్ గుర్తొస్తున్నారా? కాలేజీలో చేరడానికి మీరు ఇచ్చిన అప్లికేషన్ పూరించి సంతకంచేసి ఇందువెంట జత పరుస్తున్నానని గమ నించప్రార్థన. నన్ను గ్రాడ్యుఎట్ చేస్తారా? థాంక్స్.

నిన్నరాత్రి నిద్దరలో మరోకల వచ్చింది గురుగారూ. చెప్పనా? మనిద్దరం ఏంచక్కా మనిద్దరమేట. ఇంకెవ్వరూ, ముఖ్యంగా పూజ్యు లయిన అత్తమామలిద్దరూ వేనిచోట మనిద్దరమేట గురుదారూ. మీరేం చేసారుట ఎవరూ లేకుండా చూసి నన్ను—

అబ్బ, అహ. అంతతేలికగా చెప్తాననుకున్నారా గురూజీ? ఏం చేసారో చెప్పడానికి ఓ సమయంవుంది. అక్కడే, అప్పుడే చెప్తాను ఓ.కే. ఇంకా నా సినిమా ముడుపు చెల్లించలేదేమిటి? మీ ముడుపు త్వరలో చెల్లిస్తాగా.

అబ్బ మీరు చేసిన పని తలచుకుంటే తెనాలి రామలింగడు చెప్పి నట్లు ఎంతహాయిగా వుందండీ.

వెళ్ళొస్తాను ఇక. మళ్ళీ ఉత్తరందాకా మీకూ నాకూ వచ్చు అంతే.

మీ చిలక.

తలుపుకు ఆనుకుని మరో ఉత్తరం చదవసాగాడు శివరావు ఎంతో హాయిగావుంది శివరావుకి అలా తలుపుకు అనుకుని, చల్లగాలి తగులు తూంటే, సిగరెట్ తాగుతూ, గంటకి నలభై మైళ్ళ పైనే పోతున్న రైలులో పెళ్ళాం వ్రాసిన ఉత్తరాలు చదువుతుంటే.

మరో ఉత్తరం తీసాడు.

నా ప్రాణానికి,

మీరు ఎంత త్వరగా ఇల్లుచూస్తే అంతమంచిది. చిన్న గదయినా ఎటాచ్‌డ్ బాత్‌రూం వుంటే. చాలా ఇబ్బందిగా వుంటోంది. ఉత్తరాలతో ఎంతకాలం గడపగలం? పెళ్ళయి నెల దాటుతున్నా మనం ఇంకాకొత్త వాళ్ళలాగానే, కేవలం పెళ్ళికుదిరి ఇంకా పెళ్ళి చేసుకోవాల్సిన వాళ్ళలాగా దూరం దూరంగా వుండటం బావుళ్ళేదు. మీరు మూడుముళ్ళు వేసాక ఆ మూడురాత్రులు తప్ప మిగతా రాత్రులన్నీ నిశిరాత్రులే. సిగ్గువిడిచి వ్రాస్తు న్నాననుకోకండి. మనసులోమాట దాచుకోకుండా చెప్పేయటం నానైజం.

ఇంకో కథ. కొత్తకథ ఈసారి, చెప్పనా?....

రైలువేగం తగ్గుతున్నట్లుగా అనిపించి బయటకి చూసాడు,తగ్గటం లేదు.

ఆ వుత్తరం పూర్తిగా చదివి కాగితాలన్నీ మడిచి పేంట్‌జేబులోకి కుక్కి, కొత్తసిగరెట్ వెలిగించాడు శివరావు పాతదానితో.

కళ్ళు మూసుకుని గుండెలదాకా సిగరెట్ పొగ పీల్చి వదిలాడు. మైథిలి అందమైనరూపం తలచుకుంటూ. రైల్వే స్టేషలోకి బయల్దేరు తూంటే రహస్యంగా తన షర్ట్‌జేబులో మైథిలి కుక్కిన కాగితం సంగతి గుర్తుకు వచ్చింది.

ఆ కాగితం తీసాడు, కాగితాలు దొరకకపోవడంవల్ల అవచ్చు, ఓ కేలండర్ వెనకభాగంలో వ్రాసింది. పెన్సిల్‌తో.

నా ప్రాణానికి,

తిరిగిరాగానే. కొత్తఇంట్లోకి మారగానే మీకో తియ్యటి బహుమతి ఇస్తాను. అదేమిటో తెలుసా?

34—24—32. ఎప్పటికీ మీ చిలకమ్మ.

రెండు మూడుసార్లు చదువుకుని, ఆ ఉత్తరంలోని అంకెలువ్రాసిన భాగంలో ముద్దుపెట్టు కున్నాడు మృదువుగా.

"ఐ లవ్ యు డార్లింగ్. ఐ నీడ్‌యు" అనుకున్నాడు మనసులో.

కొద్దిగా గుండెల్లో గుబులు మొదలయింది పదిరోజులు మైధిలిని వదిలి వుండాలంటే వాళ్ళేమయినాచేస్తే మైధిలిని తను తిరిగి వచ్చేలోపల?

అంత ధైర్యం వుందా తనవాళ్ళకి?

శివరావుకే తెలుసు ఆ ప్రశ్నకి సమాధానం.

తను తిరిగిరాగానే కొత్తఇంట్లోకి మారతాడు. గొలుసు ప్రజెంట్ చేస్తాడు. మైధిలికి. కాలేజీలో చేర్పిస్తాడు. ఎల్. ఐ. సి పాలసీ తీసుకుంటాడు. జాయింట్ బేంక్ ఎకౌంట్ తెరుస్తాడు. పదిహేను రోజులు శలవ పెట్టి ఆఫీసువాళ్ళు ఇచ్చే డబ్బుతో, మైధిలితో వూటీ వెళతాడు హనీమూన్‌కి.

ఊటీలో, ఖరీదైన హోటల్ గదిలో, ఫోమ్ బెడ్‌మీద, బయట చలివేస్తూంటే లోపల—

రైలు వేగం తగ్గినట్లనిపించింది ముందు స్టేషన్ ఏదయినా వస్తోదేమోనని చూడటానికి ముందుకు వంగాడు శివరావు.

స్టేషన్ ఏమీ కనపడలేదు. బహుశ సిగ్నల్ పడివుంచవచ్చు. సిగ్నల్ పోల్ చూద్దామనే ఆసక్తితో ముందుకు వంగాడు.

బయట చలివేస్తూంటే లోపల మైధిలిని....

స్ప్లిట్ సెకండ్!

క్షణకాలం! !

మానవ జీవితంలో విధి చెలగాటమాడే ఒకే ఒక్క క్షణం.

అంతే! !

అలా ముందుకి వంగి శివరావు చీకట్లో చూసుకోలేదు రైలు పక్కనే వున్న ఓ పోల్‌కి కొట్టుకున్నాడు వెంటనే పట్టుతప్పి క్రిందపడి పోయాడు. స్పీడ్ అందుకున్న మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌లోంచి. అతాకిడికి తల పగిలి క్రిందపడకముందే ప్రాణంపోలేదు వెంటనే.

అలా జరగలేదు.

"మైథిలి నా చిలకమ్మా మైథిలి" అని కలవరిస్తూనే వున్నాడు. మర్నాడు మధ్యాహ్నం చచ్చిపోయేదాకా అలా ఓ ముళ్ళపొదలో కదల కుండా పడివున్నాడు.

అయిదురోజుల తర్వాత శివరావు శవాన్ని గుర్తించి, జేబులోని ఉత్తరాలద్వారా అతనెవరో పోల్చుకున్నారు.

(ఆంధ్రభూమి వారపత్రిక 7–9–1978)